సాక్షి హనుమకొండ

శనివారం । 20 । జనవరి । 2024



గిరిజన కళాకృత సమ్మేళనం

మేడారం మహాజాతరలో ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండ్‌క్రాఫ్ట్స్ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. - 8లో▸



ఎయిడ్స్ నియంత్రణకు ...

ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎమర్జెన్సీ ఎక్స్‌-రే సేవలు బంద్



ఎంజీఎం: ఎంజీఎంలో ఎమర్జెన్సీ రోగులకు అందించాల్సిన ఎక్స్‌-రే సేవలు నిలిచిపోయాయి. నెల రోజులుగా ఎక్స్‌-రే మిషన్ పని చేయట్లేదని సమాచారం. నిత్యం వేలాది మంది వైద్య సేవల కోసం వచ్చే ఎంజీఎంలో సరిపడా సిబ్బంది ఉన్నప్పటికీ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సరైన సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారుల ఈవిషయంపై చర్యలు తీసుకొని ఎక్స్‌-రే సేవలు ప్రారంభించాలని కోరుతున్నారు.

ఆర్ట్స్ కళాశాలతో ఎంఓయూ



కేయూ క్యాంపస్: తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ములుగు ఐటీడీఏ ఏటూరునాగారం వారు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం, తెలుగు విభాగాలతో పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) శుక్రవారం కుదుర్చుకున్నారు. ఆకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య ఆధ్వర్యంలో.. టీటీడబ్ల్యూఆర్డీసీ ములుగు ఏటూరునాగారం కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె.రాధిక, ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ టి.సంజీవ్ పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో ఆకళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ తిరుణహరిశేషు, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ శివకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్

విద్యారణ్యపురి: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికల్ని(ఎనిమిదో తరగతి వరకు) ఈనెల 29న నిర్వహించనున్నారు. అందుకోసం శనివారం పాఠశాలల్లో నిర్వహించనున్న పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఈనెల 22, 23 తేదీల్లో తల్లిదండ్రుల జాబితా ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ, 24న తల్లిదండ్రుల ఫైనల్ జాబితాను వెల్లడిస్తారు. 29న పాఠశాలల్లో ప్రతీ క్లాస్‌కు ముగ్గురు సభ్యుల చొప్పున (చేతులెత్తే పద్ధతి) ఎన్నుకుంటారు. ఆసభ్యుల నుంచే కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. హనుమకొండ జిల్లాలో 561 కమిటీలను ఎన్నుకుంటారు. ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు యాజమాన్య కమిటీల్ని ఎన్నుకోవాలని మార్గదర్శకాలను జారీ చేశారు. ఎంఈఓలు ఆకమిటీల ఎన్నికల తీరును పర్యవేక్షించనున్నారు.

సమన్వయంతో పని చేయండి



వరంగల్ క్రైం: ప్రభుత్వ విభాగాల సమన్వయం, ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణకు పని చేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల ఫిబ్రవరి 14 వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్ని పురస్కరించుకుని శుక్రవారం కమిషనరేట్‌లో రాష్ట్ర రోడ్డు రవాణా విభాగం, పోలీస్ అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మార్కెట్, ఇతర వ్యాపారస్తులతో సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రజలు సైతం భాగస్వాములు కావాలని కోరారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర రోడ్డు సేఫ్టీ విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్ రవి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం రహదారి భద్రతా మాసోత్సవాలపై రవాణాశాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాల్ని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ పురుషోత్తం, ఆర్టీఓ రంగారావు, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, సీతారెడ్డి, సుజాత, ఎంవీఐలు రమేశ్‌రాథోడ్, రవీందర్, స్వర్ణలత, షాలిని, ఫహీమా, శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మార్కెట్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదవుల పందేరం!



నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహుల ఆరాటం

- కీలక పదవి రేసులో వేం నరేందర్ రెడ్డి? కేబినెట్ హోదా వస్తుందని ప్రచారం
- రాష్ట్రస్థాయి చైర్మన్ పదవుల్లో గతంలో ఉమ్మడి జిల్లానుంచి 9 మంది
- 'కుడా' చైర్మన్‌తో పాటు మార్కెట్ కమిటీల కోసం ప్రయత్నాలు
- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులపైనా బడా నేతల నజర్
- గాడ్‌ఫాదర్‌లతో కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, వరంగల్:

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో నామినేటెడ్ పదవుల రేసు మొదలైంది. ఎమ్మెల్సీలతోపాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల కోసం పదవుల పందేరం జోరందుకుంది. ఉమ్మడి వరంగల్ నుంచి పలువురు సీనియర్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత, సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డికి కేబినెట్ హోదాతో ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవి రాబోతుందన్న ప్రచారం ఉంది. దీంతో నామినేటెడ్ పోస్టుల పరంపర మొదలైందని భావిస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిని బట్టి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రేసులో సీనియర్ నేతలు.. ఎందరికి దక్కేనో పదవులు..

నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలు కావడంతో సీనియర్‌లు ఎవరికీ తోచిన విధంగా వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య వరంగల్ ఎంపీ టికెట్ లేదా ఏదైనా రాష్ట్రస్థాయి పదవిని ఆశిస్తున్నారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎండీ.అజీజ్‌ఖాన్, అబుబక్కర్, ఈవీ శ్రీనివాసరావులు ప్రయత్నాల్లో ముందువరుసలో ఉన్నారు. మహిళా నాయకులు సరళాయాదవ్, కూచన రవళిరెడ్డి, పీసీసీ నేత దొమ్మాటి సాంబయ్య, పరకాల టికెట్ వదులుకున్న ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి రాష్ట్రస్థాయి పదవులపై గురిపెట్టారు. జనగామ జిల్లానుంచి వై.సుధాకర్, వేమల్ల సత్యనారాయణరెడ్డి, సి.శ్రీనివాసరెడ్డి, మైనారిటీ వర్గానికి చెందిన జమాల్ షరీఫ్, లక్ష్మీనారాయణ నాయక్, ముత్తినేని సోమేశ్వరరావు, ఎస్.ప్రవీణ్‌రావు ఆశిస్తున్నారు. మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ ఎంపీ టికెట్ కోసం పట్టుబడుతున్నారు. లేదంటే ఎమ్మెల్సీ, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ కావాలంటున్నట్లు ప్రచారం. కాంగ్రెస్ ఆదివాసీ కమిటీ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, నూనావత్ రాధ, మాలోతు నెహ్రూనాయక్, వీరభద్రం తదితరులు పదవుల రేసులో పార్టీ సీనియర్లను కలిశారు. ములుగు డీసీసీ అధ్యక్షుడు పి.అశోక్, గొల్లపల్లి రాజేందర్, భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్ రేసులో ఉన్నట్లు అధిష్టానానికి తెలియజేశారు. ఇదిలా ఉంటే గ్రేటర్ వరంగల్‌కు సంబంధించి పార్టీ కీలకంగా భావించే 'కుడా' చైర్మన్ పదవితో పాటు మార్కెట్ కమిటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, తదితర పదవుల కోసం పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను కలవడంతోపాటు గాడ్‌ఫాదర్‌ల చుట్టూ తిరగడం పార్టీవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

గత ప్రభుత్వంలో 9 కార్పొరేషన్ పదవులు.. ఆ రేషియో కోసం ప్రయత్నాలు...

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 54 రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను భర్తీ చేస్తే.. అందులో 9 కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఉమ్మడి వరంగల్ సీనియర్ నేతలను వరించాయి. రాష్ట్ర రుణ విమోచన సంస్థ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, రైతుబంధు సమితి చైర్మన్ తాటికొండ రాజయ్య, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి, రెనోవెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ (రెడ్‌-కో) చైర్మన్ వై.సతీష్ రెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్, రహదారుల అభివృద్ధి సంస్థకు మెట్టు శ్రీనివాస్, సంగీత, నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, జల వనరుల అభివృద్ధి చైర్మన్‌గా వీరమల్ల ప్రకాశ్ వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో రద్దయిన ఈ పదవులపై ఆ పార్టీ ఆశావహులు ఎప్పటినుంచో కన్నేశారు. ప్రభుత్వం కూడా ఎమ్మెల్యే సీట్లు వదులుకున్న వారు, ఎమ్మెల్యేలుగా గెలవడానికి సహకరించిన వారికి ఎలాగైనా నామినేటెడ్ పదవులు కల్పించడం, ప్రాబల్యాన్ని చాటుకోవాలనే తలంపుతో ఉంది. ఈ మేరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కసరత్తు కూడా చేస్తున్నారన్న సమాచారంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు.

ప్రొటోకాల్ పాటించలేదని కౌశిక్‌రెడ్డిని అడ్డగింత

- అధికారులతో కలిసి అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- ఫోన్లు చేసినా మంత్రులు స్పందించలేదన్న ఎమ్మెల్యే పాడి
- 24వ తేదీ తర్వాత ఎవరు అడ్డుకున్నా ఆగేది లేదని స్పష్టీకరణ



గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీస్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూర్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అధికారులతో కలిసి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం జిల్లా మంత్రులకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అవేమీ పాటించకుండా ఎమ్మెల్యే ఒక్కరే వచ్చి అభివృద్ధి పనులను ప్రారంభించడం సరికాదని కాంగ్రెస్ కార్యకర్తలు.. మండల అధికారులకు ఫిర్యాదు చేయగా, అధికారులతో కలిసి వచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నారు. దీంతో కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ శాఖ అధికారులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నిలిపివేయాలని కోరారు. అప్పటికే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేయడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరికి అభివృద్ధి పనులు ప్రారంభించకుండానే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వెనుదిరిగి వెళ్లిపోయారు. అనంతరం కన్నూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కౌశిక్ రెడ్డి మాట్లాడారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు సంబంధించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో సహా, జిల్లా మంత్రులకు తనతోపాటు సంబంధిత అధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించినా వారు స్పందించలేదన్నారు. తాను ఓ మెట్టు దిగి ప్రస్తుతం ఈ కార్యక్రమాలను రద్దు చేసుకుంటున్నానని, ఈనెల 31తో సర్పంచుల పదవీ కాలం పూర్తవుతున్న దృష్ట్యా ఈనెల 24లోగా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు అవసరమైతే సీఎం ఎవరైనా సరే వచ్చి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయాలని లేదంటే, ఈనెల 24 తరువాత ఎవరు అడ్డువచ్చినా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పూర్తి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రజాకార్ల జమానాను తలపిస్తోందని, ప్రొటోకాల్ పేరుతో పోలీసులు తుపాకులతో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరి రాంచందర్‌రావు, జెడ్పీటీసీ లాండిగె కళ్యాణి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, మాజీ ప్రజాప్రతినిధులు మారపెల్లి నవీన్‌కుమార్, తడక శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం సిగ్గుచేటు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అయి ఉండి కూడా కౌశిక్‌రెడ్డి ప్రొటోకాల్ పాటించకుండా, మంత్రులకు సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి రావడం సిగ్గుచేటన్నారు. మరోసారి ఇలా చేస్తే తీవ్ర నిరసన సెగలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయనవెంట బీసీ సెల్ మండల అధ్యక్షుడు కొండా రమేష్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి 'బండి' పరామర్శ



రమేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సంజయ్

కమలాపూర్: మండలంలోని పంగిడిపల్లికి చెందిన బీజేవైఎం మండల అధ్యక్షుడు పుస్కూరి రాంబాబు తండ్రి పుస్కూరి రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం ఆయన కుటుంబాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పరామర్శించారు. రమేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, రావు పద్మ, గంట రవి, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు సంపత్‌రావు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందంగౌడ్, హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి, కో-కన్వీనర్ మాట్ల రమేశ్, కమలాపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, భూపతి ప్రవీణ్ పాల్గొన్నారు.

జాతర ఆదాయం రూ.65,70,140

ఎల్కతుర్తి: ఈనెల 10 నుంచి 18 వరకు జరిగిన కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో టికెట్ల ద్వారా రూ.65,70,140 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా గతేడాది ఆదాయం రూ.59,80,334 రాగా ఈఏడు అదనంగా 5 లక్షలు ఆదాయం పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. జాతర ఉత్సవాలను విజయవంతం చేసినందుకు సహకరించిన పోలీస్‌శాఖ, వివిధ శాఖల మండల అధికారులకు, వైద్యసిబ్బంది, జీపీ సిబ్బంది, కళాశాల సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే, అధికారుల ఎదుట బాధితుల మొర



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు (బాధితులు)

పరకాల: పట్టాభూముల్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామానికి చెందిన బాధితులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, అధికారులను కోరారు. రాజీపేటలోని సర్వే నంబర్ 18లో నిరుపేదలకు పంపిణీ చేసిన భూముల్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ భూమి వివాదాస్పదంగా మారింది. 1996లో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎండీ షా ఆధ్వర్యంలో 112 మందికి ఐదెకరాల భూమిని కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. అప్పట్నుంచి చాలా మంది నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో రాజీపేటకు చెందిన బోయిని స్వరూప, గువ్వ సమ్మయ్య, ర్యాకల విజయ్‌కుమార్‌తో పాటు ర్యాకల రాజేందర్ నకిలీ పట్టాలు అర ఎకరం (20 గుంటలు) ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులివ్వకూడదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి హనుమకొండలోని ఆయన నివాసంలో 6వ వార్డు కౌన్సిలర్ దామెర మొగిళి ఆధ్వర్యంలో బాధితులు ఫిర్యాదు చేశారు. పరకాల ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామికి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకపోతే రిలే నిరాహారదీక్ష చేస్తామని కౌన్సిలర్ మొగిళి హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు తిరుపతి, భిక్షపతి, సారయ్య, రాములు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సంరంభం



నిట్‌లో టెక్నోజియాన్(ఇంజీనియస్)-24 షురూ

- లాంఛనంగా ప్రారంభించిన ఇన్‌చార్జ్ డైరెక్టర్ సోమశేఖర్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మొదటి రోజు ప్రత్యేక ఆకర్షణగా క్రియేటివ్ రోబోటిక్స్ టీం ప్రదర్శనలు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో మూడు రోజుల సాంకేతిక మహోత్సవం టెక్నోజియాన్(ఇంజీనియస్)-24 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ సోమశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక విద్యను పంచుకునేందుకు, నూతన ఆవిష్కరణలకు వేదికగా ఇంజీనియస్‌గా నామకరణం చేసిన టెక్నోజియాన్-24 నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్ యాక్టివిటీస్ టీం అధ్యక్షుడు హరికృష్ణ, ఫ్యాకల్టీ అడ్వయిజర్ హరికృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలిరోజు అలరించిన టెక్నోజియాన్-24

టెక్నోజియాన్-24 ఇంజీనియస్ తొలిరోజు స్పాట్‌లైట్ ఈవెంట్స్ అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన నెక్స్ వేవ్ కంపెనీ రూపొందించిన టెక్నాలజీ 4.0 వర్చువల్ క్రికెట్, హ్యాండ్ ప్రింటింగ్, ఆర్బిక్స్ పేపర్ కటింగ్స్, ట్రేడింగ్ పిట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వరంగల్ కొత్తవాడకు చెందిన క్రియేటివ్ రోబోటిక్స్ సంస్థ ప్రదర్శించిన రోబోలు ఆకట్టుకున్నాయి. టెక్నోజియాన్‌కు దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 6వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ క్యాంపస్‌లో ఉత్సాహంగా గడిపారు.



మాట్లాడుతున్న సోమశేఖర్

చెయ్యి ప్రింట్ చెయ్యి..



టెక్నోజియాన్-24లో పాల్గొన్న విద్యార్థులు తమ జ్ఞాపకాలను భద్రపరుచుకునేందుకు స్పాట్‌లైట్ ఈవెంట్‌లో భాగంగా ఇంప్రింటింగ్ హ్యాండ్స్‌లో చెయ్యి ప్రింట్ చెయ్యి అంటూ చేతి అచ్చులను పేపర్‌లో ఆవిష్కరించారు. స్నేహితులు ఒకరికొకరు తమ చెయ్యి గుర్తులను అందజేసుకున్నారు.

ప్రమాదాలను పసిగట్టే రోబో



భూకంపం, ఫైర్, గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాలను పసిగట్టి బజర్ రూపంలో తెలియజేస్తూ మానవ హానిని నివారించడంలో డిజాస్టర్ మేనేజ్ రోబో తోడ్పడుతుంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెన్సార్‌తో రూపొందించిన రోబో ప్రమాదాలను నివారించడంతో పాటు ఆపదలో ఆదుకుంటుంది.

ఇషాన్ అగస్త్య, వరంగల్

అచ్చం క్రికెట్ ఆడినట్టుగానే..



హైదరాబాద్‌కు చెందిన నెక్స్ వేవ్ కంపెనీ రూపొందించిన టెక్నాలజీ 4.0 వర్చువల్ రియాలిటీతో ప్రత్యేక బ్యాట్‌ను చేతితో పట్టుకుని కళ్లకు ప్రత్యేకంగా సెన్సార్ అద్దాలను ధరిస్తే చాలు అచ్చం క్రికెట్ ఆడినట్లుగా అనుభూతిని పొందవచ్చు. ఐపీఎల్ ఆడే క్రికెటర్స్ ఎక్కువగా వీఆర్ క్రికెట్‌ను ఆడుతూ మెళకువలను నేర్చుకుంటారని కంపెనీ ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు.

ప్రశాంత్, నెక్స్ వేవ్ సంస్థ ప్రతినిధి

నేటి కార్యక్రమాలు ఇవే..

టెక్నోజియాన్ రెండో రోజు శనివారం స్పాట్‌లైట్స్ ఈవెంట్స్‌లో భాగంగా ఎస్కేప్ రూమ్, వీఆర్ క్రికెట్, ఆర్సీ బగ్గీ, జబాజ్, ఓవర్‌మానియా, పిక్సెల్ టూ పేపర్ జరగనున్నాయి.

అయోధ్య రాముడిని చూసొద్దాం



అయోధ్యలోని రాముడిని చూసొద్దాం రండి అంటూ ప్రత్యేకంగా మొబైల్‌లోని బ్లూటూత్ సాయంతో రూపొందించిన రోబోటిక్ వాహనాన్ని వరంగల్‌కు చెందిన శ్రీచరణ్ ప్రదర్శించాడు. దేశంలోని వివిధ ప్రాంతాలను దాటుకుంటూ అయోధ్యకు చేరుకునేందుకుబ్లూటూత్ ఎలా తోడ్పడుతుందో వివరించడం ఎంతగానో ఆకట్టుకుంటోంది.

శ్రీచరణ్, వరంగల్

అంధులకు దారి చూపే బ్లైండ్ స్టిక్



అంధులకు బాటసారిగా నడకలో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించేందుకు బ్లైండ్ స్టిక్ తోడ్పడుతుంది. దీన్ని వరంగల్‌కు చెందిన రాము అనే విద్యార్థి తయారు చేశాడు. అల్ట్రా సానిక్స్ సెన్సార్‌తో రూపొందించిన ప్రత్యేక కర్రను అంధులు చేతపట్టుకుని నడుస్తున్న తరుణంలో ఎవరైనా ఎదురైనా, అవంతరాలు దరిచేరిన తరుణంలో బజర్ మోగుతుంది. దీంతో అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది.

రాము, వరంగల్



క్లుప్తంగా

23న పారామెడికల్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ఎంజీఎం : రాష్ట్ర పారామెడికల్ బోర్డు ఉత్తర్వుల మేరకు కాకతీయ మెడికల్ కళాశాలలో మిగిలి ఉన్న వివిధ డిప్లొమా పారామెడికల్ కోర్సుల సీట్ల భర్తీకి ఈనెల 23న రెండో విడత, మాప్ ఆప్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కౌన్సిలింగ్‌కు గత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు కూడా అర్హులుగా పేర్కొన్నారు. వివిధ పారామెడికల్ కోర్సుల్లో మొత్తం 94 సీట్ల భర్తీకి ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కావున విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో కౌన్సెలింగ్ కు హాజరు కావాలని ఆయన సూచించారు.

డీబీఎం కాల్వకు గండి యత్నం

- తిరగబడ్డ రైతులు
- అధికారులతో వాగ్వాదం


గండికొట్టడానికి సిద్ధంగా ఉన్న జేసీబీ

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం సమీపంలోని 22/బీ డీబీఎం కాల్వకు మళ్లీ గండి కొట్టడానికి యత్నించారు. జేసీబీతో కాల్వ ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా.. రైతులు ఘటన ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గతంలో పూడ్చిన గండిని జేసీబీ సాయంతో బుధవారం మళ్లీ తొలగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో అన్నాసాగరానికి చెందిన రైతులు అధికారులపై తిరుగబడ్డారు. శనిగరం, అంబాల, కానిపర్తి రైతుల తోపాటు అన్నాసాగరం రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్ఈ ఆదేశాల మేరకే గండి తెరుస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెప్పారు. దీంతో ఎస్ఈతో మాట్లాడానికి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నించగా.. ఆయన స్పందించారు. చివరికి ఏఈ భాస్కర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

30న ఆస్తుల వేలం

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి విశాల సహకార సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై వరంగల్ కోర్టు గతేడాది 11 నెల 3న విచారణ చేపట్టింది. విచారణలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ గోలి రాజేశ్వర్‌రావు, సీఈఓ కొమ్మిడి వినయ్‌కుమార్ కలిసి నిధులు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో దుర్వినియోగమైన నిధులను తిరిగి చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. శుక్రవారం మండల కేంద్రంలో జరగాల్సిన బహిరంగ ఆస్తుల వేలం అనివార్య కారణాల వల్ల ఈనెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు కేడీసీసీ సేల్ ఆఫీసర్ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక జీపీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు ఆస్తులు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మునిగడుప శేషగిరి, పాలకవర్గ సభ్యులు లోకిని సూరయ్య, కృష్ణమూర్తి, మహేందర్, సమ్మయ్య, సీఈఓ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్


విద్యార్థుల్ని సన్మానిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఉమ్మడి జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఈనెల 12న ×హెచ్ఐవీ–ఎస్టీఐ× అంశంపై జైపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ కాంపిటీషన్‌లో ద్వితీయ బహుమతి పొందిన గండి సహస్ర, నలిమేల అక్షయను కలెక్టర్ శాలువా, బొకేతో సత్కరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన కాకతీయ మెడికల్ కాలేజ్ నర్సింగ్ స్టూడెంట్స్‌కు సర్టిఫికెట్ అందించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాంబశివరావు హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ కోసం పని చేస్తున్న సిబ్బందికి గుర్తింపు పత్రాలు అంజేశారు.

గణతంత్ర వేడుకల్ని విజయవంతం చేయాలి

సమన్వయంతో పని చేస్తూ గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డీఆర్ఓ గణేశ్, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరిత ప్రాంగణంగా కలెక్టరేట్

హరిత ప్రాంగణంగా హనుమకొండ కలెక్టరేట్ రూపుదిద్దుకుంటోందని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం వివిధ రకాల పూలమొక్కలు, ఆకర్షణీయ మొక్కలు నాటారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి: వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: గణతంత్ర వేడుకల్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె శుక్రవారం అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే, వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ సంపత్‌రావు, డీపీఓ కల్పన, డీఈఓ వాసంతి, గ్రేటర్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తుల్ని పరిష్కరించండి

పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఓటరు నమోదు కార్యక్రమం, పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అంతరాయం లేకుండా బియ్యం రవాణా చేయాలి

కరీమాబాద్: జిల్లాలోని రేషన్ దుకాణాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం రవాణాలో అంతరాయం కలగొద్దని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం రవాణాకు సంబంధించిన టెండర్లను కాంట్రాక్టర్ల సమక్షంలో తెరిచారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి బియ్యం రవాణా కోసం వరంగల్ నుంచి ముగ్గురు, నర్సంపేట, వర్ధన్నపేట నుంచి ఒక్కొక్కరు చొప్పున టెండర్లు దాఖలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్‌లో స్ప్రింగ్ ఫైర్

- రెండురోజుల పాటు వేడుకలు
- ఈనెల 27న అంతర్జాతీయ సదస్సు
- ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిరుమల్‌రావు, అధ్యాపకులు

హసన్‌పర్తి : కళాశాలలో స్ప్రింగ్ ఫైర్ వేడుకలకు నిర్వహించనున్నట్లు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం కళాశాలలో ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్ తోపాటు వివిధ మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని చెప్పారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి చదువున్న విద్యార్థుల కోసం మోడల్ పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదన్నారు. క్యూఆర్ కోడింగ్ స్కానింగ్ చేసుకుని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వంద రూపాయాల ఫీజును క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

27న అంతర్జాతీయ సదస్సు

ఎస్‌వీఎస్ కళాశాలలో జనవరి 27న అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు డాక్టర్ తిరుమల్‌రావు తెపారు. లండన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎస్‌వీఎస్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

కుటుంబానికి మహిళే ఆధారం


డబ్ల్యూడబ్ల్యూఓ బాధ్యులు, మహిళా కార్మికులతో మాలిని జైన్

- రైల్వే డబ్ల్యూడబ్ల్యూఓ అధ్యక్షురాలు మాలిని జైన్
- కాజీపేట జంక్షన్‌లో ఉమెన్స్ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం
- మహిళా కార్మికులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

కాజీపేట రూరల్: ప్రతి కుటుంబానికి మహిళ ఆధారమని రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూడబ్ల్యూఓ) సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షురాలు మాలిని జైన్ అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్ రైల్వే డబ్ల్యూడబ్ల్యూఓ ఆధ్వర్యంలో ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కాజీపేట సబ్ డివిజన్ అధ్యక్షురాలు ఆర్.దీపిక ప్రశాంత్ కృష్ణసాయి అధ్యక్షతన రైల్వే కాంట్రాక్ట్ మహిళా కార్మికులకు ఉమెన్స్ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా మాలిని జైన్ మాట్లాడారు. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ఒక యంత్రంలా పని చేస్తుందన్నారు. ఉద్యోగం చేసే మహిళలకు ఒత్తిళ్లు ఉంటాయని వాటిని అధిగమించేందుకు యోగా, మెడిటేషన్‌తోపాటు న్యూట్రిషన్ ఫుడ్ ఎంతో అవసరమని వివరించారు. సికింద్రాబాద్ డివిజన్ డబ్ల్యూడబ్ల్యూఓ బాధ్యులు రేష్మిగంజేలీ, ఎం.రాధ, కె.సుధ, ఎస్.తనుజ ఆధ్వర్యంలో స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సంధ్యారాణి ఆరోగ్య సమస్యలపై సెమినార్ నిర్వహించారు. అనంతరం రైల్వే కాంట్రాక్ట్ మహిళా కార్మికులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను పంపిణీ చేశారు. మాలిని జైన్‌ను రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎంఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు, కాజీపేట వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ రాంబాబు, మహేందర్, రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి జి.రాజేశ్వర్ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి


గంట రవికుమార్

ఖిలా వరంగల్: ప్రధాని మోదీ పాలనలోనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నాయకత్వంలో మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు గంట రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా అసోసియేషన్ల వివరాలివ్వండి

కాశిబుగ్గ: వివిధ క్రీడలకు సంబంధించి గుర్తింపు పొందిన క్రీడా అసోసియేషన్ల వివరాలు ఇవ్వాలని డీవైఎస్ఓ సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ క్రీడల అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు వారి పేర్లు, ఫోన్ నంబర్లు శనివారం సాయంత్రం 4 గంటల్లోపు ఓసిటీలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో అందజేయాలని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 77021 55096 నంబర్‌లో సంప్రదించాలలని సూచించారు.

డీఎస్ఓగా శివప్రసాద్‌రెడ్డి



కరీమాబాద్: జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన చందన్‌కుమార్ ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా శివప్రసాద్‌రెడ్డి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.

వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని కోరుతాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: జాతీయస్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణలో వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి సీపీఐ తరపున పోటీ చేసేందుకు కోరనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసేందుకు పార్టీ సన్నద్ధమవుతుందన్నారు. ఈనెల 21న వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగాల కల్పన, రైతాంగం, వ్యవసాయ కూలీలను విస్మరించిన బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ప్రాజెక్టుల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలులో భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుందని ఆరోపించారు. రాష్ట్రంలో నియతృత్వ పోకడలతో ప్రజాసామ్యాన్ని ఖూనీ చేసిన బీఆర్ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో కర్రె భిక్షపతి, తోట బిక్షపతి, ఎల్లేశ్, శ్రీనివాస్, సదాలక్ష్మి, రాములు, లక్ష్మణ్, రవి, శంకర్, దీనా, రమేశ్, మునిగాల భిక్షపతి పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిపై ఏడీఏ దాడి

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్‌పై అదే శాఖలో పని చేస్తున్న టెక్నికల్ ఏడీఏ శ్రీధర్ చేయి చేసుకున్న అనూహ్య ఘటన మంగళవారం చోటు చేసుకుంది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడీఏ శ్రీధర్ పర్మిషన్ తీసుకోకుండా, సమాచారం లేకుండా ఈనెల 17, 18తేదీల్లో విధులకు గైర్హాజరయ్యాడు. దీంతో అటెండెన్స్ రిజిస్టర్‌లో శ్రీధర్ గైర్హాజరైనట్లుగా నమోదు చేశానన్నారు. దీంతో కోపోద్రికుడైన శ్రీధర్ విచక్షణ కోల్పోయి తన చాంబర్‌లోకి వచ్చి తనపై చేయి చేసుకున్నాడని విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. తనపై అకారణంగా దాడి చేసిన ఏడీఏ శ్రీధర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. కలెక్టర్ భవేష్ మిశ్రాతోపాటు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విజయ్‌భాస్కర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. డీఏఓతో మాట్లాడాను తప్పా, చేయి చేసుకోలేదని ఏడీఏ శ్రీధర్ తెలపడం గమనార్హం.

పంట క్షేత్రాల పరిశీలన


జీల్లులలో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని కోతుల నడుమ, జీల్లులలో సాగు చేసిన వరి పంటను స్థానిక వ్యవసాయ అధికారులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ శాస్త్రవేత్తలు వెంకన్న, రాము, శ్రవణ్‌కుమార్, మాధవి, ఏఓ రాజ్‌కుమార్ పరిశీలించారు. సాగు చేసిన వరిపంటలో మోగిపురుగు ఉధృతి ఉంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు, లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లీగర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే క్లోరాంట్ర నీలిప్రాల్ 0.3 మిల్లీగ్రామ్‌ను లీటర్ నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పిలక దశలో ఉన్న వరిలో ఎకరానికి 10 కిలోల చొప్పున 3జీ గుళికలను పొలంలో చల్లాలని సూచించారు. దీని వల్ల మోగిపురుగు ఉధృతి తగ్గుతుందని పేర్కొన్నారు. సల్ఫేట్ దుష్ప్రభావం ఉంటే దాని నివారణకు రైతులు ఆరుతడి పద్ధతిలో పొలాన్ని వెంట్రుకవాసి పగుళ్లు వచ్చే వరకు ఆరబెట్టి తర్వాత నీరు పెట్టాలన్నారు. అమోనియం సల్ఫేట్ వంటి ఎరువుల్ని ఉపయోగించకూడదని, చౌడు సమస్య ఉంటే దాని నివారణకు పొలం ఆరకుండా తడుపుతూ.. నీటిని బయటకు పంపించాన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువునిచ్చే పంటల్ని పంట విరామంలో సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజ్‌కుమార్, తిరుపతి, కల్పన, రోజా, రైతులు పాల్గొన్నారు.

జాతరలో గిరిజన కళాకృత సమ్మేళనం

- టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ అరుణ్‌కుమార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మహాజాతరలో ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. కేంద్ర పర్యాటక సాంస్కృతిక అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం డైరెక్టర్ అరుణ్‌కుమార్.. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మేడారంలోని గిరిజన మ్యూజియం, హరిత హోటల్‌ను సందర్శించారు. మేడారం జాతరలో దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ సమ్మేళనం ఏర్పాటు చేసి ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా 20 మంది ట్రైబల్ కళాకారులు సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తారని తెలిపారు. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో థీమ్ ఫెవిలియం ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనిలో దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన సంప్రదాయ సంస్కృతుల కళాఖండాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జాతరలో ఏర్పాటు చేయబోయే గిరిజన కళాకృతుల సమ్మేళనానికి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన కళాకారుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అరుణ్‌కుమార్ వనదేవతలను దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ రాజేంద్రం, పూజారులు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ సత్యపాల్‌రెడ్డి, ఈఓ రాజేంద్రం, ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, డీపీఓ వెంకయ్య, ఏఎస్ఓ రాజ్‌కుమార్, మ్యూజియం అసిస్టెంట్ క్యూరెటర్ కురసం రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్


ప్రమాదానికి గురైన బస్సు


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- 8మందికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు: ఆర్టీసీ బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా బస్సులో ప్రయాణిస్తున్న 8మందికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నీరుకుళ్ల క్రాస్ రోడ్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా పస్రా నుంచి హనుమకొండకు ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వెళ్తుండగా మండలంలోని నీరుకుళ్ల క్రాస్‌రోడ్ సమీపంలో ఎదురుగా ములుగువైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అతి వేగంగా ఢీకొని రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ బొమ్మగంటి సదానందం, కండక్టర్ ఆర్.సునిత ప్రయాణికులు పస్రా గ్రామానికి చెందిన పూజారి సునిత, పూజారి సరిత, పూజారి రజిత తలలకు గాయాలయ్యాయి. పస్రాకు చెందిన చింతోజు దుర్గాభవానికి కాళ్లు, చేతులకు గాయాలుకాగా.. గోవిందరావుపేట మండలం ముత్తాపూర్ గ్రామానికి చెందిన మందపెల్లి శ్రీనివాస్, ఘన్‌పూర్ మండలం లింగంపల్లికు చెందిన వల్లె బొందమ్మ గాయపడ్డారు. గాయాలైన వారిని 108 సిబ్బంది రమేష్, గణపతి చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కండక్టర్ సునిత ఫిర్యాదు మేరకు ఆత్మకూరు సీఐ రవిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

- రూ.3లక్షల అపహరణ

కాజీపేట: తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటనలో గుర్తు తెలియని దుండగులు రూ.3లక్షల నగదుతో పాటు కొన్ని విలువైన వస్తువులను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట పట్టణానికి చెందిన శ్రీనివాస్ రావు (బిల్డర్), బబ్లూ కుమార్ (రైల్వే ఉద్యోగి)లు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు కుటుంబ సమేతంగా వెళ్లారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయా ఇళ్లకు ఉన్న తాళాలను పగుల గొట్టి బీరువాల్లోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం చుట్టుపక్కలవారు గమనించి బాధితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సీఐ సార్ల రాజుతోపాటు ఎస్సై లవన్‌కుమార్ క్రైమ్ పార్టీ పోలీసులతో వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించి, ఆధారాల సేకరణ కోసం ప్రయత్నించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులు రెండు ఇళ్లలో ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్

హన్మకొండ అర్బన్: ఓటు నమోదు, మార్పులు, చేర్పులకు ఈనెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈతేదీల్లో బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారాలతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉండనున్నట్లు వివరించారు. జనవరి 01, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు, ఓటరుగా నమోదు కానివారు, ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

గూర్ఖాకు గుండె జబ్బు

- ఆధార్, రేషన్ కార్డు లేక అందని ప్రభుత్వ సాయం
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు


గుండె జబ్బుతో బాధ పడుతున్న డమ్మర్ రాణా

దోర్నకల్: అతనో గూర్ఖా.. రాత్రి పూట కాలనీల్లో తిరుగుతూ దొంగలబెడద నుంచి ప్రజలను కాపాడుతుండేవాడు.. అతనే నేపాల్ దేశానికి చెందిన డమ్మర్ రాణా. 25ఏళ్ల క్రితం కుటుంబంతో సహా దోర్నకల్‌కు వచ్చి స్థిరపడ్డ ఈ డమ్మర్ రాణాది నేపాల్‌లోని అచాం జిల్లా కుంతి గ్రామం. భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులతో దోర్నకల్‌లో నివాసం ఉంటూ గూర్ఖాగా పని చేస్తూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే ఈమధ్యకాలంలో తరచూ అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా.. గుండెలో రెండు వాల్వ్‌లు మూసుకుపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్సకు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో పేదకుటుంబానికి చెందిన డమ్మర్ రాణా దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.


ఆధారమే లేదు..

దీన గాథ

నేపాల్ దేశానికి చెందిన డమ్మర్‌రాణా సుమారు 25ఏళ్లుగా దోర్నకల్‌లో నివాసం ఉంటున్నాడు. కానీ, తనతోపాటు కుటుంబ సభ్యులకు ఆధార్, రేషన్ కార్డు లేదు. దీంతో ఇక్కడి ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం అందే అవకాశం లేకుండా పోయింది. కార్డుల కోసం పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోగా.. ప్రస్తుతం గుండె జబ్బుతో ఇబ్బంది రావడంతో ఆ పేద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయాల్సిన ఫోన్ పే నంబర్: చందా అనూష 79953 92162

అలరించిన సంగీత, నృత్య కళార్చన


కళార్చనలో పాల్గొన్న సంగీత కళాశాల విద్యార్థులు

హన్మకొండ కల్చరల్ : విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆవరణలోని పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కళార్చన సంగీత నృత్య విద్యార్థుల సాంస్కృతికోత్సవం అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్టిఫికేట్, డిప్లమా సంగీత, నృత్య కోర్సు విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మృదంగ విద్వాంసులు భీమ్‌శంకర్ ఆధ్వర్యంలో మృదంగ విద్యార్థి లయ విన్యాసం అలరించింది. హిందూస్థానీ గాత్రం అధ్యాపకులు అనుముల యోష ఆధ్వర్యంలో విద్యార్థులు రాగ్ యమన్ సర్గమ్ లక్ష్మణ్‌గీత్, ధృత్ ఖయాల్ తీన్‌తాల్ వినిపించారు. కర్ణాటక గాత్రం విద్వాంసులు సింగారపు భాస్కర్ ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులు కల్యాణిరాగం ఆదివర్ణంలో వనజాక్షి, బిలహరి రాగం ఖండచాపు తాళంలో పరిదానము, సావేరి రాగం ఆది తిస్రగతి, శంకరి శంకరు శ్రావ్యంగా ఆలపించారు. మృదంగ విద్వాంసులు భీమ్‌శంకర్ మృదంగసహకారం అందించారు. పేరిణి నృత్యం అధ్యాపకురాలు సీహెచ్ నవ్యజ ఆధ్వర్యంలో విద్యార్థులు మేళ ప్రాప్తి సప్త తాళ విన్యాసం, భవానా కౌత్వం నృత్యప్రదర్శన అలరించింది. కూచిపూడి నృత్యం విద్యార్థులు రామాయణ శబ్దం, పూజ నృత్యం చేశారు. కార్యక్రమంలో గడ్డం శంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.